అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



రెడ్డీలపాలెంలో అక్రమంగా నిర్మించిన షెడ్‌ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



కల్లివానిపాలెంలో షెడ్లు తొలగిస్తున్న సిబ్బంది

- కల్లివానిపాలెం, రెడ్డీలపాలెంలో షెడ్ల తొలగింపు
- రూ.7 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం స్వాధీనం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు బీచ్‌ రోడ్డు పరిసరాల్లో ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాదారులు ఆక్రమణకు సిద్ధమైపోతున్నారు. గెడ్డ అయినా, పక్కా ప్రభుత్వ స్థలం అయినా సరే షెడ్లు ఏర్పాటు చేసి దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు సోమవారం ఉక్కుపాదం మోపారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించారు. వివరాల్లోకి వెళ్తే... కాపులుప్పాడ రెవెన్యూ పరిధి కల్లివానిపాలెం సర్వే నంబరు 138, 139లో గల ప్రభుత్వ స్థలాల్లో ఓ వ్యక్తి నిర్మించిన 11 షెడ్లను తహసీల్దార్‌ వేణుగోపాల్‌ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. మొత్తం 50 సెంట్ల విస్తీర్ణం గల ఈ ప్రభుత్వ స్థలం విలువ సుమారు రూ. 5 కోట్లు ఉంటుందని, ఈ స్థలంలో నిర్మించిన షెడ్లు తొలగించామని, త్వరలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

- కాపులుప్పాడ పరిధి రెడ్డీలపాలెం సర్వే నంబరు 312లో ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి నిర్మించిన భారీ కాంపౌండ్‌ వాల్‌, షెడ్లను తొలగించారు. 20 సెంట్లు గల ఈ ప్రభుత్వ స్థలం విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని తహసీల్దార్‌ వేణుగోపాల్‌ తెలిపారు. ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.
- జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ప్రధాన రహదారి వెంబడి ఓ వ్యక్తి నిర్మించిన కమర్షియల్‌ షెడ్‌ను ఏసీపీ రఘునాథ్‌ ఆదేశాల మేరకు సోమవారం తొలగించారు. గతంలోనే నిర్మాణాలు నిలిపివేసినప్పటికీ తమ మాటలను ధిక్కరించి షెడ్‌ నిర్మించారని అధికారులు తెలిపారు.

గ్రావెల్‌ తరలిస్తే క్రిమినల్‌ కేసులు

సాక్షి ఎఫెక్ట్‌..

కొమ్మాది: కొండలను తవ్వి గ్రావెల్‌, రాయి అనధికారికంగా తరలిస్తే చర్యలు తప్పవని, ఎంతటి వారిపైనైనా క్రిమినల్‌ కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్‌ వేణుగోపాల్‌ హెచ్చరించారు. జీవీఎంసీ 4వ వార్డులో కొండలు తవ్వి గ్రావెల్‌, రాయి అక్రమంగా తరలిస్తున్న వైనంపై 'యథేచ్ఛగా కొండలు తవ్వేస్తున్నారు' అనే శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. కాపులుప్పాడ, కె.నగరపాలెం కొండ ప్రాంతాల్లో గ్రావెల్‌ తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఓ లారీని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంతాల్లో యథేచ్ఛగా గ్రావెల్‌ తరలింపు వాస్తవమేనని, ఇక నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రావెల్‌, రాయి అనుమతి లేకుండా తరలిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. గతంలో అక్రమార్కులపై చర్యలు తీసుకున్నప్పటికీ మారడం లేదని, ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



గ్రావెల్‌ తరలిస్తున్న లారీ స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్‌ వేణుగోపాల్‌, రెవెన్యూ సిబ్బంది

జోన్‌ - 2 'స్పందన'కు 12 అర్జీలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న మధురవాడ సూపరింటెండెంట్‌ అప్పలరాజు



వినతిపత్రం స్వీకరిస్తున్న భీమిలి జెడ్సీ రాము

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌ - 2లో సూపరింటెండెంట్‌ అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చాయి. షిప్‌యార్డు లే అవుట్‌ బింద్రానగర్‌ ఎస్‌ఎఫ్‌ఎస్‌ స్కూలు వద్ద మురుగు నీటి ప్రవాహానికి అవకాశం లేకుండా జరుగుతున్న పనులపై చర్యలు చేపట్టాలని బింద్రానగర్‌ హౌస్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు కోరారు. మారికవలస శ్మశానం ఎదురు రోడ్డు పాడైపోవడంతో వర్షం కురిస్తే బురద, రాళ్లు తేలిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని, ఎస్‌కేఎమ్‌ఎల్‌ అపార్ట్‌మెంట్‌ ముందు కాల్వ సరిగా లేదని, పందులు, దోమలు నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సత్య ఎన్‌క్లేవ్‌కి చెందిన పి.రామసుందరరావు తదితరులు కోరారు. చాణక్యపురి లే అవుట్‌లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, గెడ్డ ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని ఎస్‌ఎస్‌కేజీపీ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, సత్యసాయి సుందర్‌నగర్‌కి చెందిన జీవీఆర్‌ మూర్తి ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదులు సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు చేపడతామని అప్పలరాజు హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: భీమిలి జోనల్‌ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు 14 వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్‌ విభాగానికి సంబంధించి 9 వినతులు, పట్టణ ప్రణాళిక విభాగానికి 3, యూసీడీ విభాగానికి ఒక వినతి వచ్చాయి. సంబంధిత సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జెడ్సీ రాము తెలిపారు.

క్లుప్తంగా

పప్పెట్‌ స్టోరీ టెల్లింగ్‌ పోటీలకు ఆహ్వానం

తగరపువలస: పప్పెట్‌ స్టోరీ టెల్లింగ్‌ పోటీల్లో పాల్గొనేందుకు చిన్నారులకు పెపప్‌ సంస్థతో కలిసి జెమ్స్‌ ఎడ్యుకేషనల్‌ ఆర్గనైజింగ్‌ సంస్థ ఆహ్వానం పలుకుతోంది. పెపప్‌ మూడో ఎడిషన్‌ నిర్వహణలో భాగంగా మే 6న నగరంలోని రామ్‌నగర్‌ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ పోటీలు నిర్వహిస్తుంది. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు ఫైనల్‌ రౌండ్‌ పోటీలు, 4.30 నుంచి 5.30 వరకు షాడో పప్పెట్‌ వర్క్‌షాపు, 6.30 నుంచి 7.30 వరకు పప్పెట్‌ షో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే చిన్నారులు 4 నిమిషాల వ్యవధిలో రికార్డ్‌ చేసిన స్టోరీని ఈ నెల 30లోగా 98494 88923కు వాట్సాప్‌ ద్వారా లేదా artoflearning22@gmail.comకు మెయిల్‌ చేయాలని కోరారు.

స్టోరీకి మెటీరియల్‌ గ్లోవ్‌, స్ట్రింగ్‌, రాడ్‌, ఫింగర్‌, షాడోలను ఉపయోగించి ఫన్నీ, హర్రర్‌, ఫాంటసీ, మోరల్‌ ఆధారిత అద్భుత కథలు పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 90190 67760, 98494 88923లో సంప్రదించాలని నిర్వాహకురాలు కె.అమలారెడ్డి కోరారు.

సామాజిక తనిఖీలతో పాఠశాలలు బలోపేతం



శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పద్మనాభం: సామాజిక తనిఖీలతో పాఠశాలలు బలోపేతమవుతాయని సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రేవిడి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల సామాజిక తనిఖీపై ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాలల్లో వసతుల కల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల భద్రత, సాల్ట్‌ పథకం, ఎండీఎం అమలు తీరు తదితర అంశాలను పాఠశాల సామాజిక తనిఖీ యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే జిల్లాకు 11 లక్షల పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. యూనిఫారాలు కూడా జిల్లాకు చేరాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శివరాణి, జీసీడీవో ఎస్‌.కె.బేగం, ఎస్‌ఆర్‌పీలు ఎస్‌.సత్యారావు, కె.సత్తిబాబు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవడానికి అధికారులంతా కృషి చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్‌ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌ చట్టం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్‌ కుమార్‌, ఈవోఆర్డీ ఎం.ఉషారాణి, మండల పరిషత్‌ సూపరింటెండెంట్‌ పి.రాధ పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో ఇద్దరి అరెస్ట్‌

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో ఈ నెల 9న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బయటపడిన గంజాయి కేసుకు సంబంధించి గతంలో ఒకరిని అరెస్టు చేయగా మరో ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ ఎస్‌.సన్యాసినాయుడు తెలిపారు.

సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. రుషికొండకు చెందిన గుంపా వీర్రాజు (24), అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కొయ్య మామిడి గ్రామానికి చెందిన బుచ్చిబాబును సోమవారం అరెస్ట్‌ చేసి భీమునిపట్నం 14వ మెట్రోపాలిటన్‌ మేజిస్ట్రేట్‌ కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. వీరికి న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్‌ విధించినట్టు సీఐ తెలిపారు.

27 నుంచి లక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవాలు



లక్ష్మీదేవి అమ్మవారు



స్వతంత్రనగర్‌లో ఉత్సవ రాట వేస్తున్న భక్తులు

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధిలో ఉన్న స్వతంత్రనగర్‌ లక్ష్మీ దేవి అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 27, 28, 29వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి బండియ్య చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆలయం వద్ద ఉత్సవాల నిర్వహణకు ప్రధాన అర్చకులు పూలఖండం గౌరీప్రసాద్‌ శర్మ ఆధ్వర్యంలో రాట వేసి, అంకురార్పణ చేశారు. అనంతరం బండియ్య మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు ఏటా నిర్వహించిన దానికంటే మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ నెల 25న ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తామని, 27 నుంచి 29 వరకు జాతర, 30న ఆదివారం అన్న సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి బాలు పాత్రో, కోశాధికారి కొత్తాల శ్రీను, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ దిబ్బ శ్రీను, ఉప కోశాధికారి దాది గౌరీశంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

దగ్గుతో బాధపడితే కఫం పరీక్ష తప్పనిసరి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆనందపురం : రెండు వారాలకు పైబడి దగ్గుతో బాధపడుతున్న వారు తప్పకుండా కఫం పరీక్ష చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ సూచించారు. మండలంలోని తర్లువాడ పంచాయతీ, ప్రకృతివానిపాలెం గ్రామంలో సోమవారం జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు శైలజ మాట్లాడుతూ క్షయవ్యాధిని సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దగ్గుతో బాధపడుతున్న వారు కఫం పరీక్ష చేయించుకోవాలని, ఆశా కార్యకర్తల వద్ద పరీక్ష పరికరాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి డాట్స్‌ ప్రోగ్రాం ద్వారా మందులు ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కార్యకర్త సాంబమూర్తి, హెల్త్‌ సూపర్‌వైజర్‌ ఐ.గోవిందరావు, సీహెచ్‌వో మానస, హెల్త్‌ అసిస్టెంట్‌ తారకేష్‌, పాఠశాల ఉపాధ్యాయరాలు భవానీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



నోట్‌ పుస్తకాలతో విద్యార్థులు, నాయకులు

పద్మనాభం: అఖిల భారత బార్‌ కౌన్సిల్‌ మాజీ చైర్మన్‌, విశాఖ నగర మాజీ మేయర్‌ డీవీ సుబ్బారావు జయంతి సందర్భంగా కురపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రూపాకుల విశాలాక్షి చారిటబుల్‌ ట్రస్టు, గాయత్రి వెల్ఫేర్‌ కల్చరల్‌ యూత్‌ అకాడమీ, మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయం సంయుక్తంగా స్టేషనరీ సోమవారం పంపిణీ చేశారు. ప్రముఖ న్యాయవాది, సామాజిక సేవకురాలు దుర్వాసుల శర్వాణి చేతుల మీదుగా పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, గ్రీన్‌ చాక్‌బోర్డు అందజేశారు. ముందుగా డీవీ సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శర్వాణి మాట్లాడుతూ డీవీ సుబ్బారావు నగర మేయర్‌గా పని చేసి విశాఖ అభివృద్ధికి కృషి చేశారన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌ మ్యాచ్‌లు విశాఖపట్నంలో నిర్వహించి, ప్రపంచ పటంలో విశాఖకు గుర్తింపు తెచ్చారన్నారు. కార్యక్రమంలో రూపాకల విశాలాక్షి చారిటబుల్‌ ట్రస్టు చైర్మన్‌ రూపాకుల రవికుమార్‌, ధాత్రి ఫౌండేషన్‌ అధినేత విశాలాక్షి, ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు పాల్గొన్నారు.

క్లాప్‌, రేషన్‌ వాహనాలకు వీధుల్లో ట్రాఫిక్‌ సమస్య



జీవీఎంసీ ఒకటో వార్డు శ్రీనగర్‌ కాలనీలో క్లాప్‌ వాహనానికి ఇరువైపులా వాహనాలు

తగరపువలస: ఇంటింటికీ రేషన్‌ పంపిణీ, క్లాప్‌ వాహనాల ద్వారా ఇళ్ల నుంచి చెత్త సేకరణకు భీమిలి జోన్‌లో పలు వీధులు సమస్యాత్మకంగా మారాయి. దీంతో రేషన్‌, క్లాప్‌ వాహనాల డ్రైవర్లు, పారిశుధ్య సిబ్బందే వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌ చేసిన వాహనాలను అతికష్టం మీద తొలగించుకోవాల్సి వస్తోంది. కొన్ని రహదారుల్లో కార్లు, ఆటోలు, రవాణా వాహనాలు కూడా గంటల తరబడి తిష్ట వేయడంతోపాటు భవన నిర్మాణ మెటీరియల్‌, డెబ్రిస్‌ ఉండడంతో రేషన్‌, క్లాప్‌ వాహనాల సిబ్బంది విధులకు ఆటంకంగా మారుతోంది. కొన్నిసార్లు ఈ వాహనాలు ముందుకు, వెనక్కు కదలలేని పరిస్థితి నెలకొనడంతో ఇతర వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారుతోంది. చెత్త సేకరణకు భీమిలి జోన్‌లో ఉన్న 21 వాహనాలకూ రోజూ ఎక్కడో ఒకచోట ఈ ఇబ్బంది తలెత్తుతుండటంతో విధులు ఆలస్యమవుతున్నాయని డ్రైవర్లు, పారిశుధ్య సిబ్బంది వాపోతున్నారు. ఉదయం 5.30 గంటలకు విధులు ప్రారంభమైతే వాహనాల అడ్డంకి కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవుతుందన్నారు. సెలవుల మరుసటి రోజైతే మరో గంట ఆలస్యమవుతుందంటున్నారు. తరచూ చెబుతున్నా గాంధీబొమ్మ వీధి, శ్రీనగర్‌ కాలనీ, సంతపేట రెడ్డివీధి, కుమ్మరి వీధి, గొల్లవీధి, పాత లోకల్‌ ఆఫీసు వీధి, ఆదర్శనగర్‌, రామన్నపేట, సంతబయలు రోడ్డు, కొండపేట, చావుల మదుం రోడ్డు, గణేష్‌ థియేటర్‌ రోడ్డు, వెలంపేట, జీరుపేట, బైపాస్‌రోడ్డులోని సర్వీస్‌రోడ్డు, బంగ్లామెట్ట, వేంకటేశ్వరమెట్ట, ఇడదాసరిపేట, నమ్మివానిపేట గ్రామాల్లో ఈ సమస్య ఉంటుందని వాహనాల సిబ్బంది అంటున్నారు. జీవీఎంసీ, ట్రాఫిక్‌ పోలీసులు గంటల తరబడి పాతుకుపోతున్న వాహనాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాడి ఈశ్వరమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట రెడ్డివీధికి చెందిన ఈశ్వరమ్మ రాయపాలెం నుంచి మహాలక్ష్మిపురం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన ఆటో ఢీకొట్టి ఆగకుండా భీమిలి వైపు వెళ్లిపోయింది. వెనుక నుంచి వస్తున్న మరో ఆటోలో ఆమెను మారికవలస గాయిత్రి ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రమాదంలో ఈశ్వరమ్మ కుడి కాలు విరిగిపోయినట్టు వైద్యులు తెలిపారు. భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవిష్కరణలకు మేధోహక్కులు పొందాలి

కొమ్మాది: ప్రపంచ మేధోహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయం స్కూల్‌ ఆఫ్‌ లా ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నాగపూర్‌లో గల రాజీవ్‌ గాంధీ నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంటలెక్చువల్‌ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్‌తో కలిసి ఆన్‌లైన్‌ వర్క్‌షాప్‌లో ఐటీఆర్‌ నిపుణుడు డాక్టర్‌ భరత్‌ ఎస్‌ సూరివంశీ పాల్గొని ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలకు తప్పనిసరిగా మేధోహక్కులు పొందాలని ఆయన సూచించారు.

విద్యుత్‌ సరఫరాకు రేపు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ సేవానగర్‌ ఫీడర్‌ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం సాయిరాం కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్‌ - 3 ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ పోలాకి శ్రీనివాసరావు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు సాయిరాం కాలనీలోని అన్ని ఫేజ్‌లు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోతోందని, వినియోగదారులు, ప్రజలు సహకరించాలని శ్రీనివాసరావు కోరారు.

కాపునాడు భీమిలి కార్యవర్గం

భీమునిపట్నం: భీమిలి పరిధికి చెందిన కాపునాడు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైయింది. అధ్యక్షునిగా చెల్లూరి గౌరినాయుడు, ప్రధాన కార్యదర్శిగా ప్రగడ సత్యనారాయణ (చంటి), కోశాధికారిగా నాగిరెడ్డి వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరినాయుడు మాట్లాడుతూ కాపుల ఐక్యతకు తన వంతు కృషి చేయడంతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాపు కుల పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

అంధకారంలో గాయత్రినగర్‌ కాలనీ

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం గాయత్రినగర్‌ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో సాయంత్రమైతే కాలనీలో అంధకారం రాజ్యమేలుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి కాలనీకి వెళ్లే రోడ్డు సుమారు అర కిలోమీటరు దూరం ఉంటుంది. ఈ ప్రాంత వాసుల రాకపోకలతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఈ మార్గంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. విద్యుత్‌ దీపాలు లేని కారణంగా రోడ్డుపై పడుకున్న కుక్కల గుంపు పలుమార్లు పాదచారులపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. వెంటనే అధికారులు స్పందించి కాలనీకి వెళ్లే రోడ్డు పొడవునా వీధి దీపాలు పునరుద్ధరించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిలావస్థలో వ్యవసాయశాఖ కార్యాలయం



పెచ్చులు ఊడిపోతున్న వ్యవసాయ శాఖ కార్యాలయం మెట్ల మార్గం



శిథిలమైన కిటికీ

ఆనందపురం : మండల వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విధుల నిర్వహణకు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనానికి ఇంత వరకూ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో భవనం పాక్షికంగా దెబ్బతింది. ముఖ్యంగా వర్షాకాలంలో పలు ఇక్కట్లు పడుతున్నారు. మెట్లు, కిటికీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కింద స్టోర్‌ రూమ్‌, పైన కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యాలయం కోసం నిర్మించిన పైభవనం పూర్తిగా శిథిలమై వర్షానికి కారిపోవడంతో కింద ఉన్న స్టోర్‌ రూమ్‌లోనే కార్యాలయం నిర్వహించుకుంటున్నారు. పైగదికి చేరుకోవడానికి నిర్మించిన మెట్లు పూర్తిగా పాడయ్యాయి. కిటికీలు ధ్వంసమయ్యాయి. అలాగే పైగదిలోనే మరుగుదొడ్డు నిర్మించారు. అది కూడా పూర్తిగా పాడైంది. మరోవైపు కార్యాలయం చుట్టూ గోడలకు చెదలు పట్టి పుట్టలు ఏర్పడ్డాయి. ప్రాంగణం కంటే కార్యాలయం లోతుగా ఉండడంతో వర్షాకాలంలో వరద నీరు నేరుగా లోనికి ప్రవహిస్తోంది. అందులోనే ఎరువులు, విత్తనాలు నిల్వ చేస్తుండడంతో తడిసి పాడవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. దీంతో ద్వారం వద్ద ఎత్తుగా మట్టిని ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

టమాటా ధరల్లో తీవ్ర వ్యత్యాసాలు

- రైతుల నుంచి చౌకగా కొంటున్న వ్యాపారులు
- వినియోగదారులకు కిలో రూ.20 చొప్పున విక్రయం



తగరపువలస మార్కెట్‌లో విక్రయిస్తున్న టమాటాలు

తగరపువలస: స్థానిక ప్రైవేట్‌ మార్కెట్‌లో టమాటా రైతుకు ఆశించిన ధర లభించడం లేదు. వినియోగదారునికి మాత్రం రైతు దగ్గర ధర కంటే రెండున్నర రెట్లకు చిల్లర వ్యాపారులు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్‌ వ్యాపారులు కూడా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధర కంటే అధికంగా హోటళ్లు, హాస్టళ్లకు విక్రయిస్తున్నారు. ఒక్కచోటే వివిధ ధరల వ్యత్యాసాలతో టమాటాలు విక్రయిస్తుండడంతో వినియోగదారులు, రైతులు విస్తుపోతున్నారు. తగరపువలసలో స్థానిక ప్రైవేట్‌ మార్కెట్‌తోపాటు బయట హోల్‌సేల్‌, చిల్లర దుకాణాల ద్వారా రోజూ 25 టన్నుల వరకు టమాటాలు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం స్థానికంగా రైతుల పంటతోపాటు విజయవాడ, నంద్యాల, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, మదనపల్లె, బెంగళూర్‌, జైపూర్‌, మానాపురం, రామభద్రాపురం ప్రాంతాల నుంచి దేశవాళీ టమాటా దిగుమతులు ఎక్కువగా ఉన్నాయి. స్థానికంగా పద్మనాభం, భోగాపురం, భీమిలి, డెంకాడ మండలాల నుంచి కూడా రైతులు రోజూ రెండు నుంచి అయిదు టన్నుల వరకు టమాటాలను మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. వీరి వద్ద 25 కిలోల కేట్‌ ధరను చిల్లర వ్యాపారులు రింగ్‌గా ఏర్పడి రూ.200కు మించి కొనుగోలు చేయడం లేదు. దీంతో తెచ్చిన టమాటాలను కిలోకు రూ.8 వంతున అప్పగించి వెళ్లిపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన టమాటాలను వ్యాపారులు కేట్‌ రూ.350 వంతున విక్రయిస్తున్నారు. వీరి వద్ద కిలో రూ.14 పడుతుంది. కేట్‌ల వంతున టమాటాలను కొనుగోలు చేయలేని వినియోగదారులు చిల్లర వ్యాపారులు వద్ద రూ.20 వంతున కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతు బజారుల్లో కిలో టమాటా రూ.12కే లభిస్తుండగా ఈ ప్రాంతంలో రైతు బజారు లేకపోవడం వల్ల రూ.20 వంతున కొనుగోలు చేయాల్సి వస్తోందని స్థానిక వినియోగదారులు వాపోతున్నారు.

టీచర్స్‌ కాలనీలో నిలిచిన మురుగు



ఆదర్శనగర్‌ టీచర్స్‌ కాలనీ వద్ద నిలిచిన మురుగు

తగరపువలస: ఈ నెల 22న సాయంత్రం కురిసిన వర్షానికి బైపాస్‌రోడ్డులోని సర్వీస్‌ రోడ్లు మళ్లీ జలమయమయ్యాయి. హైవే డ్రైనేజీలు నిండిపోయాయి. దీంతో ఈ డ్రైనేజీలు, సర్వీస్‌రోడ్లను ఆనుకుని ఉన్న ఆదర్శనగర్‌, టీచర్స్‌ కాలనీని మురుగు ముంచెత్తింది. ఇంటి నుంచి బయటకు రావాలంటే మురుగులో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని టీచర్స్‌ కాలనీ వాసులు వాపోతున్నారు. డ్రైనేజీల్లోని పూడిక తొలగించి ఆధునికీకరించాలని కోరుతున్నారు.